# గోరువంకలు



దేవరకొండ బాల గంగాధర తిలక్

# గోరువంకలు

## దేవరకొండ బాలగంగాధర తిలక్

**D.S. MURTHY,**
42, TUDOR GARDENS, STONY STRAT FORD,
MILTON KEYNES MK 11, 1 HX (U.K.)

# అనుక్రమణిక


తిలక్ జ్ఞాపకాలు: మరీ పాతవీ, ఆ తరువాతవీ ......... 3

గోరువంకలు ......... 10

శిశిరము ......... 18

స్వయంవర ......... 20

ఆవాహన ......... 24

సైన్యసుందరి ......... 25

వర్షా ......... 26

దీక్ష ......... 28

మధు విరహము ......... 29

భ్రాంతి ......... 32

శర్వరీప్రియ ......... 33

ఆటవెలది ......... 38

శ్రీవివేకానందస్వామి ......... 42

సంగీత వృత్తము ......... 44

సీత-1 ......... 46

సీత-2 ......... 49

అద్వైతమాన్మథము ......... 52

అమృతభావము ......... 54

ముక్తకము ......... 59

# తిలక్ జ్ఞాపకాలు: మరీ పాతవీ, ఆ తరువాతవీ

1966 జులై ఒకటవతేదీనో, రెండవతేదీనో, సరిగా గుర్తు లేదు. పదకొండు, పన్నెండు గంటలవేళ- ఏలూరు నుంచి ఫోన్‌కాల్. ఫోన్‌లో స్మైల్. తిలక్‌గారు పోయారంటూ మృతి వివరాలు చెప్పాడు. పేపర్లో ప్రచురణకు వార్త రాసుకున్నాను గాని, ఒకంతట నమ్మబుద్ధి కాలేదు.

తిలక్‌ది అక్షరాలా అకాలమరణం. ఆ రోజుల్లో ఈ మాట అనుకోనివారు లేరు, బాధపడనివారు లేరు. సృజనశక్తి సర్వతోముఖంగా విజృంభిస్తున్న సమయంలో ఆయన ఆకస్మికంగా మిత్రుల్ని, అభిమానుల్ని విడిచి వెళ్ళి పోయాడు.

తిలక్ మంచి వచన కవితలలో మరీ మంచివాటిలో ఒకటి-

నువ్వు లేవు నీ పాట వుంది; ఇంటిముందు
జూకా మల్లెతీగల్లో అల్లుకుని
లాంతరు సన్నని వెలుతురులో క్రమ్ముకుని
నా గుండెల్లో చుట్టుకుని
గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో
దాక్కుని నీరవంగా నిజంగా వుంది
జాలిగా హాయిగా వినపడుతూ వుంది...

అని చాలా అందంగా, ఆర్ద్రంగా సాగిపోయే గీతం తిలక్‌ని తలుచుకున్నప్పుడల్లా మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తుంది.

నిజమే మరి. ఇవాళ తిలక్ లేడు. తిలక్ పాట వుంది. నిజంగా వుంది. జాలిగా హాయిగా వినపడుతూ వుంది. ఇంకా ఇంకా అలా వినబడుతూనే వుంటుంది.

రాజమండ్రి ఆర్ట్స్ కాలేజిలో చదువుకునే రోజుల్లో సూరంపూడి భాస్కరరావు ద్వారా తిలక్‌తో పరిచయం. భాస్కరరావు నాకంటే రెండేళ్ళు సీనియర్. తిలక్‌దీ అతనిదీ ఒకేవూరు. ఏమోయ్ అనుకునే చిన్ననాటి స్నేహితులు. తిలక్ తణుకునుంచి అప్పుడప్పుడు రాజమండ్రి వచ్చి. పిలకా గణపతిశాస్త్రిని,

ఇతర సాహితీమిత్రుల్ని కలుసుకుని, ఒకటి రెండు సాహిత్య సభల్లో ప్రసంగించి, స్వీయ కవితల్ని వినిపించి వెళ్ళిపోయేవాడు. అవి 1943-44 నాటి రోజులు. భాస్కరరావు - అతని క్లాస్ మేట్ రాయప్రోలు రాజశేఖర్ మాటల్లో చెప్పాలంటే- 'చాలా వేల్యువబుల్ పొయిట్రీ' రాస్తూ వుండేవాడు. నేనూ ఏవో పద్యాలూ పాటలూ గిలకాలని ఉబలాటపడుతూ వుండేవాడిని. ఆ రోజుల్లో అలా ఆ పాటలు, పద్యాల నెపంతో తిలక్‌తో నాకు పరిచయమైంది.

భాస్కరరావు ఓసారి క్రిస్మస్ సెలవుల్లో కాబోలు, వాళ్ళ వూరు తీసుకువెళ్ళాడు. అప్పటి తణుకుకి, ఇప్పటి తణుకుకి పోలికే లేదు. దాదాపు యాభై ఏళ్ళ నాటిమాట కదా? తిలక్ అంటే ఇష్టంవల్లనో, అతని అందమైన కవిత్వాన్ని ఇన్‌స్పయిర్ చేసిందనో, తణుకు ఆ రోజుల్లో ఆంధ్రలోని చక్కని పట్టణాల్లో ఒకటి అనిపించేది. ముగ్గురం ఆ సాయంత్రం వూరి వెలుపల గోస్తనీ నది ఒడ్డున చెట్లకింద కూర్చున్నాము. ("అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది") తిలక్ తన పద్యాలు గొంతెత్తి రాగయుక్తంగా చదివాడు. ఆరాత్రి వాళ్ళ డాబాపై నక్షత్రాల కింద కూర్చుని భాస్కరరావు తన పాటలు, నేను నా పాటలు పాడి వినిపించాము. అవి నేను సైగల్, పంకజ్ మల్లిక్, రాజేశ్వరరావు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, టాగోర్‌ల ఆరాధనలో మునిగి తేలుతున్న రోజులు.

"విభుడేగు దెంచేటి వేళాయెనేచెలీ! సజ్జ సవరించేటి సమయమిదియే సఖీ!" అనే నా పాట నేను పాడి వినిపిస్తే, "చాలా బావుంది మీ పాట", అని అభినందిస్తూ "నా పాటలకి కూడా ఇలా ట్యూన్స్ కట్టి పెడతారా?" అని తిలక్ మెచ్చుకోలుగా అడగడం నేను గర్వపడే జ్ఞాపకాల్లో ఒకటి.

అప్పటి తిలక్ రూపం, పద్యాలు నాకు లీలగా గుర్తు. సన్నగా(?), పొడుగ్గా(?) తెల్లగా మెరిసిపోతూ, పెద్ద పెద్ద అంగలతో నడుస్తూ, ఎప్పుడూ కృష్ణశాస్త్రి గురించో, టాగోర్ గురించో, మొత్తంమీద కవిత్వం గురించే, సాహిత్యం గురించే మాట్లాడుతూ, సాహిత్యమే జీవితమైనట్టు, - తరువాత రోజుల్లో తన గురించి తానే రాసుకున్నట్టు, - కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం ధరించినవాడుగా, కళ్ళచివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నవాడుగా... దుఃఖాన్నీ చావునీ వెళ్ళిపొమ్మన్నవాడుగా... జీవితాన్ని హసన్మందారమాలగా ధరించినవాడుగా... కనబడేవాడు. అతని పద్యాలు కూడా అతనిలాగే 'ఇజాలూ రాజకీయాలూ వాదాలూ యుద్ధాలూ హత్యలూ ఇంకా ఇటువంటి చెత్తాచెదారం మనస్సులో పేరుకోకముందు' రాసినట్టు ముగ్ధమోహనంగా వుండేవి.

అప్పటికే శ్రీశ్రీ తన మహాప్రస్థానం గీతాలు పూర్తి చేసినప్పటికీ, యువకులమీద ఇంకా భావకవితా ప్రభావం తొలగిపోని రోజులు. దానినుంచి బయటపడాలన్న బలమైన ప్రయత్నమూ వుండేది. తిలక్ అప్పటికే పద్యాలతో పాటు మాత్రాచ్ఛందస్సులలోను, ముక్తచ్ఛందస్సులలోను కవితలు రాస్తున్నాడు. ఇంతలో వున్నట్టుండి ఎందుకనో ఆయన కలం నిలిచిపోయింది. దాదాపు పదేళ్ళపాటు కవిత్వం రాసినట్టులేదు. ఏదో వ్యాధి కాని వ్యాధి (హైపోకాండ్రియా?) తో బాధపడుతున్నాడని మిత్రులు అనుకునేవారు. మద్రాసులోనే ఏదో ఆస్పత్రిలో వున్నాడని, వెళ్ళిచూడమని భాస్కరరావు ఉత్తరం రాశాడు. కాని ఆ రోజుల్లో తిలక్‌ను చూడడం పడలేదు. "అమృతం కురిసిన రాత్రి" సంకలనం ప్రకారం "భూలోకం" అనే గీతం 1945లో రాసింది. ఆ తర్వాత వచ్చే "యుగళగీతం" 1955 నాటిది. అంటే పదేళ్ళపాటు కవితామౌనం! అయినా "అద్దంలో జిన్నా" (ఎంత గొప్ప ప్రోజు!) లాంటి వచన రచనలు చేయకపోలేదు.

కాని, 1956 నుంచి బాగా విజృంభించాడు. అప్పటికి ప్రపంచం మారి పోయింది. కవిత్వ స్వరూప, స్వభావాలూ మారిపోయాయి. భావకవిత్వం. రొమాంటిసిజం ఔటాఫ్ ఫ్యాషన్ అయ్యాయి. సోషలిజం, కమ్యూనిజం, సోవియటిజం, అభ్యుదయ కవిత్వం ఫ్యాషన్ అయ్యాయి. కవిత్వంలో శ్రీశ్రీదే ఏకచ్ఛత్రాధిపత్యం. ఆ ప్రభావం తిలక్ పై కూడా పడింది. 'కవితా ఓ కవితా' గీతం విన్నప్పుడు లక్ష జలపాతాల పాటలూ కోటినక్షత్రాల మాటలతోపాటు రాజ్యాలూ సైన్యాలూ విప్లవాలూ ప్రజలూ శతాబ్దాలూ నా కళ్ళముందు గిర్రున తిరిగి నేను చైతన్యపు మరో అంచుమీద నిలిచాను' అని తిలక్ రాసుకున్నాడు. అతని ఆలోచనలలో చాలా మార్పు వచ్చింది. కవిత్వంలో, కవిత్వశైలిలోకూడా మార్పు వచ్చింది. అప్పుడప్పుడు వృత్తచ్ఛందస్సులతో రాసినా, ఎక్కువగా వచన కవితా ప్రక్రియనే భావవాహికగా ఎంచుకున్నాడు. అతని రచనలలో ప్రసిద్ధమైన ఆర్తగీతం, గొంగళిపురుగులు ఇత్యాది కవితలు ఆనాటివి.

అయితే, తనపై ఎంతగా కొత్త ప్రభావాల నీడలుపడినా, తిలక్ స్వీయవాణిని, సొంతబాణీని వదులుకోలేదు. ఎన్ని కిటికీలు తెరిచి కొత్తగాలుల్ని ఆహ్వానించినా, ఆయన స్వీయ వ్యక్తిత్వం చెక్కు చెదరలేదు. అది మరింత పదును దేరింది. సమకాలికకవు లెవరిలోను కనిపించని ఒక అపూర్వ సౌందర్యంతో కూడిన పదగుంఫనం అతని కవితలకు ఒక వినూత్నత, వైలక్షణ్యం ఆపాదించి పెట్టింది. 1960 నుంచి ఆయన వచన కవిత అత్యంత మనోజ్ఞంగా సహస్ర దళ పద్మంలా

వికసించింది. వచన కవితా ప్రక్రియను అంత అందంగా, అంత వైవిధ్యంతో ఉపయోగించుకున్న ఆధునిక కవి మరొకడులేడు అనిపిస్తుంది. కవిత్వం ఒక ఆల్కెమీ అని, దాని రహస్యం కవికే తెలుస్తుందని తానే అన్నాడు. ఆ రహస్యం తెలిసిన కవిగా తిలక్ తాను ఏది రాసినా మేలిమి బంగారంలా మెరిసేటట్టు రాశాడు. రొమాంటిసిజం ఫ్యాషన్ కాని రోజుల్లో రొమాంటిక్ కవిత్వం రాసి ఒప్పించాడు. అమృతం కురిసిన రాత్రి, నువ్వులేవు నీ పాట వుంది. వానలో నీతో (ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిలా కప్పుకుంది) ఆనందం మనసులో మయూర బర్హంలా విప్పుకుంది- ఆలోచనలెందుకు జవ్వనీ! విలోకించు వర్షాసంధ్యని- సందేహం వదలి నా సందిటిని నిలిచి కళ్ళెత్తిచూడు - లాంటి గొప్ప లిరికల్ కవితలు ఆ నాటివి. నెహ్రూ పోయినప్పుడు రాసిన వచన కవిత (ప్రిన్స్ చార్మింగ్, డార్లింగ్ ఆఫ్ ది మిలియన్స్ వెళ్ళిపోతున్నాడు - దారినివ్వండి- స్వప్నశారికలతని శిరస్సు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి...) తెలుగులోని గొప్ప ఎలిజీలలో ఒకటి.

నెహ్రూవియన్ సోషలిజంమీద కొంత మొగ్గు కనబడేదికాని, మొత్తం మీద రాజకీయంగా తిలక్ ఏ యిజాన్ని అభిమానించలేదనుకుంటాను. ఒకసారి (1963) మా సంభాషణలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. రచయితలకు వ్యక్తిగతంగా ఏ రాజకీయ రాగద్వేషాలున్నా, రచనలో అవేవీ ప్రముఖంగా ముందుకు చొచ్చుకురాకూడదని, లేకపోతే అది ప్రచార సాహిత్యం అవుతుందని, రచయిత మానవతకు, సత్యావిష్కరణకు మాత్రమే కమిట్ కావాలి కాని ఏ సంకుచిత రాజకీయ వాదానికి కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. లెఫ్టిస్టులు ఆయన్ని మనస్ఫూర్తిగా ఆమోదించలేకపోవడానికి అదే కారణమనుకుంటాను. (అయితే అదే సమయంలో తిలక్ కమ్యూనిజాన్ని పూర్తిగా తిరస్కరించినప్పటికి ఆయన రచనలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు సంపుటాలుగా తీసుకు రావడం సాహిత్యపరంగా వారి ఔదార్యానికి, దృక్పథ వైశాల్యానికి నిదర్శనంగా భావిస్తాను.)

ఇప్పుడు వెలువడుతున్న ఈ "గోరువంకలు" సంపుటంలో వున్నవి అచ్చంగా తిలక్ పద్య కవితలు. ఇవి మొదటిసారిగా పుస్తక రూపంలో వస్తున్నాయి. తొలిరోజుల్లో ఆయన ఎక్కువగా పద్య చ్ఛందస్సులలోనే కవిత్వం రాసేవాడు. ఇవన్నీ భావకవితా సంప్రదాయానికి చెందినవి. ప్రత్యేకించి ఇవి ప్రణయ కవితలు. అతిసుకుమారమైన భావన, అంతే సుకుమారమైన భాష! ఈ కవితలు ఇప్పుడు చదువుతుంటే The child is father of the man అన్నట్టు, "అమృతం కురిసిన రాత్రి" లోని

గొప్ప వచన గీతాల ప్రాతిపదికలు వీటిలో వున్నట్టు కనిపిస్తుంది. కృష్ణశాస్త్రి అనేవారు ప్రతి మాటకి రంగు, రుచి, వాసన ఉంటాయని. ఆ రహస్యం ఎరిగి పద ప్రయోగం చేసిన కవి తిలక్. Poetry is music in words and music is poetry in sound అని ఇంగ్లీషులో ఒక నిర్వచనం. తిలక్ కవిత్వం సరిగా అలాంటిది. అతనిది సంగీత మాధుర్య, మార్దవాలతో పెనవేసుకున్న కవిత్వం. యువకవులకు సహజంగా వుండే శబ్దతౌల్యం కూడా కనబడుతుంది. అంత ట్రాన్స్‌పరెంట్ కాని చీకటిలాంటి అస్పష్టతా, అన్వయ క్లిష్టతా వున్నాయి. అయినా తిలక్ ఒకచోట తనే కవితను నిర్వచించినట్టు, మొత్తంమీద పాఠకుడికి అతని అనుభూతి ఆకారం అందుతుంది, హత్తుకుంటుంది. అతని కవిత కొత్త అనుభవాల కాంతి పేటికను తెరుస్తుంది.

కొన్ని పద్యాలు ఇప్పుడు మళ్ళీ చదువుతుంటే తిలక్ స్వయంగా చదివినప్పటి జ్ఞాపకాలు ముసురుతున్నాయి. భాస్కరరావుకీ, నాకూ బాగా ఇష్టమైన పద్యాలలో మచ్చుకి ఒకటి-

ప్రతిదినమేగు బాష్పకణభార నిరోధ దిశాంతనేత్రమై
ప్రతి వకుళమ్ము రాలు శిశిరాత్త దళాంత గళోచ్ఛ నాదమై
ప్రతి తెలి వేకువన్ తొలగి రాలెను తారలు గాజుపూసలై
అతివ! కదల్చె కీ వయసు టద్దపుమేడ పునాది గోడలన్.

తిలక్‌కు ఇష్టమైన ఇతివృత్తాలలో సీత మహనీయ దయనీయ గాథ ఒకటి కాబోలు, ఆ ఇతివృత్తం తీసుకుని తొలిరోజుల నుంచి మలిరోజుల వరకు చక్కని ఖండికలు ఆయన రాస్తూనే వున్నాడు. 'స్వయంవర' అనే తొలినాళ్ళ ఖండికలో సీత రాముని మొదటిసారిగా చూసినప్పటి అనుభూతిని కవి ఇలా వర్ణించాడు:

అదిగో సాగెను స్వామి విల్లుకయి ఆ యందమ్ము ప్రాతస్సర
స్సదనోద్దీపిత రాజహంసవలె అశాంతమ్ము శోభించు క
న్నుదలన్ చూడవె లౌకికావధుల నాందోళించు క్రొవ్వెల్గు సం
పదలోమున్ చెలి ఆతడే అతడు నా ప్రాణేశు డాజన్మమున్.

60లలో రాసిన అద్వైతమాన్మథము పరిణత రచన. సీత రామునితో అంటున్నది:

నేను నీలోన నన్ను సృజించుకొనగ
నీవు నాలో లయింతు వెంతేని వింత
ఇది యపూర్వక్రమము సృష్టి మొదలు తుదలు
కలసికొన్నవి మనలోన కాలమాగి -

భారతజాతికి సీతపట్ల గల పవిత్ర గౌరవభావాన్ని కవి మరొక ఖండికలో ఇలా వర్ణించాడు.

పాండవపత్ని జీవితపుబాట యగమ్యము నిత్యయాతనా
చండిమమున్; తదన్య గుణశాలిను లున్నను, తల్లి నీవు మా
గుండెల రక్తనాళముల కోసిన జాలివి, నిర్మలత్వమే
నిండుగ వెల్గు నీ కనుల నిల్చును జాతికి వెల్గు మిన్నులై.

స్వామివివేకానందకు శతజయంతి నివాళిగా రాసిన ఖండికలో ఎంత సరళంగా ఎంత గొప్ప భావాన్ని ప్రకటించాడో ఈ క్రింది పద్యంలో చూడవచ్చు:

దేవుడెచట మనసు తేట తేరిన చోట
దేవుడెచట యిరులు తెగిన చోట
దేవుడెచట సకల దీనుల కన్నీట
దేవుడెచట స్వామి నీవు నచట!

పోనుపోను తిలక్ భాష, భావం తేటతేరి సరళ సౌందర్యంతో భాసించసాగింది. ఆయన వచన కవితలోను, పద్యకవితలోను ఒక క్రమపరిణామం, పరిణతి ప్రస్ఫుటించాయి. సరిగా ఆ దశలోనే తిలక్ అకాలంలో కన్నుమూశాడు. ఒక గొప్ప సంగీతం మధ్యలో ఆగిపోయినట్టు, మధురంగా నిక్వణిస్తున్న వీణాతంత్రి ఆకస్మికంగా తెగిపోయినట్టు, ఒక ఉద్యమం అర్థంతరంగా నిలిచి పోయినట్టు, తిలక్ ప్రపంచరంగస్థలి నుంచి నిష్క్రమించాడు. కీట్స్ ఇంకా చిన్న వయస్సులోనే మరణించాడు కాని, తిలక్ మృతి కీట్స్ మరణాన్ని జ్ఞాపకం చేస్తుంది. తిలక్ ఇంకా బ్రతికి వుంటే ఇంకా

ఎన్ని మహత్తర కవితలు, ఎంత వైవిధ్యంకల రచనలు వెలార్చి వుండేవాడోననే భావం బాధతో మనస్సును చివుక్కుమనిపిస్తుంది.

అయితే, తిలక్ వదిలివెళ్ళిన సాహిత్య భాండారం తక్కువేమీకాదు. రాశిలో కొద్దిదే కావచ్చుగాని వాసిలో దొడ్డది. బహుశా మరణానంతరమే ఆయన కవితా వైశిష్ట్యాన్ని దేశం మరింతగా గుర్తించిందేమో ననిపిస్తుంది.

ఇప్పుడు తిలక్ పద్య కవితలను 'గోరువంకలు' పేరుతో సంపుటంగా ప్రచురిస్తూ, లండన్‌లో వుంటున్న తిలక్ కుమారుడు డాక్టర్ సత్యనారాయణ మూర్తి తన తండ్రిగారి ఈ పద్య కవితా సంపుటానికి పీఠిక వ్రాయవలసిందిగా నన్ను కోరి నా చిన్ననాటి తిలక్ జ్ఞాపకాలను, ఆయనపట్ల నాకు గల గౌరవాభిమానాలను ఈవిధంగా జ్ఞాపకం చేసుకునే అవకాశం కలిగించినందుకు కృతజ్ఞత తెలుపుకుంటున్నాను. ఈ కవితా సంపుటి తిలక్ అభిమానులకు, కవితా రసజ్ఞులకు ఆదరపాత్రం కాగలదని నా ఆశంస.

విజయవాడ —నండూరి రామమోహనరావు

7-11-92

# గోరువంకలు

ఓరగ చూచినావు కల లొత్తిన  ఎత్తుల గోరువంకలై
చారు త రోహలాడ,   విలసన్నవ యౌవన రాజ్యలక్ష్మి! నీ
ఊరుపుగాలికే జగము లోసరిలెన్ మరి పాట పాటగా
తీరిచికొందు నాయెడద తీయని కోర్కెలతేనె వాకలన్.

పాటను పైటగా  మలచి భామిని రమ్మిటు[1] స్వప్న చిత్రకాం
తాటవి లోని మేడలకు త్రావని తేనెల పాత్ర   లెన్నో[2] నీ
నీటగు మోవిపై నిలిపి నే కనురెప్పల మంచురేకులన్
చాటుగదింపి గ్రోలెదను చాలని చావని సౌఖ్య లిప్త కై

నీలాలై ప్రవహించు కాలమును మున్నీరుం దరంగాల నీ
కేళీ నిష్కుటమందు క్రొందెరలుగా కీలించి నిర్మించి నా
లీలా గీతపు మల్లెపూ బొదలలో లేజవ్వనీ నిన్ను ని
వ్వాళింతున్ నునువెచ్చ కౌగిళుల నిశ్శ్వాసించి వాసింపగన్.

అందపు లేతసిగ్గు తడియారని తారుణ కుంకుమ ప్రభల్
విందొనరించు నీ పసిమి విల్చిన చెక్కిలి వోలె నాకు నీ
సుందర సంధ్యవేళ పొడచూపును వంపుల ఆకసమ్ము ఓ
స్పందిత చంద్రమః ప్రభ! శుభానన! రమ్మిక మోహగీతివై.

---

[1] రమ్ము మదీయ మోహనా

[2] లట్లె

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=695**

****

**Read other books by Devarakonda Bala Gangadhara Thilak @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=216**